సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం। 10। సెప్టెంబర్। 2025



తనువు చాలిస్తున్నారు

ఒత్తిడి, కుటుంబ సమస్యలతో పలువురు బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. -8లో ▸



ప్రాజెక్టులకు తగ్గిన వరద

జూరాల, సుంకేసుల, శ్రీశైలం జలాశయాలకు ఎగువ నుంచి వచ్చే వరద మంగళవారం తగ్గుముఖం పట్టింది. -8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.1 /20.8

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన పెంచాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలో 22 పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సైబర్ వారియర్స్ కానిస్టేబుళ్లకు డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన సైబర్ వారియర్స్ టీషర్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో సైబర్ నేరాలపై జరిగే కార్యక్రమాల్లో సైబర్ వారియర్స్ టీషర్టులను ధరించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ ఉపేందర్‌రావు, ఎస్బీసీఐ కనకయ్య, ఎస్ఐ ఉమాదేవి పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నివారించేందుకు కృషి



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో ఎక్కడయినా భ్రూణ హత్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, భ్రూణ హత్యలు నివారించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డా.రవికుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖ సంయుక్తంగా మహిళా సాధికారతలో భాగంగా ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ టీచర్లకు లింగ వివక్ష, లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని మండలాల్లో ఆడ శిశువుల నిష్పత్తి తగ్గిందని, ప్రస్తుతం వెయ్యి మంది మగ పిల్లలకు 892 మంది ఆడ శిశువులు జన్మిస్తున్నారని, రాష్ట్ర సరాసరి 939 తో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆడ శిశు భ్రూణ హత్యలను నివారించి, లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం అమలుకు సహకరించాలని కోరారు. ఎవరైనా గర్భిణులకు స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ చేస్తే 85008 79884 నంబర్‌కు ఫోన్, వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యత్యాసం చూపొద్దు

తల్లిదండ్రులు ఆడపిల్లలు, మగపిల్లల మధ్య వ్యత్యాసం చూపకుండా అన్నింటిలో సమాన అవకాశాలు కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిణి రాజేశ్వరి మాట్లాడుతూ కోరారు. సమాజంలో బాలికల లింగ నిష్పత్తి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఆరోగ్య ఉపకేంద్రం)లో హెచ్‌ఐవీ పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆంటీ రిట్రో వైరల్ చికిత్స ఇప్పించడం వలన హెచ్‌ఐవి వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రాజగోపాలచారి, సోషల్ ఆక్టివిస్ట్ హైందవరెడ్డి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి



కోడేరు: పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన మండలంలోని తీగలపల్లి రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్ద కాలం గడిచినా భూ నిర్వాసితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకపోవడం సరికాదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువకు మూడు రెట్లు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అదే విధంగా వృద్ధులు, వితంతువులకు నేటికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి రవి, రామయ్య, వల్లి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లికి చెందిన రైతు యాసాల రాంరెడ్డి. తనకున్న ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాడు. కనీసం 12 యూరియా బస్తాలు అవసరం ఉండగా, పదిరోజులుగా ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం చుట్టూ తిరుగుతున్నాడు. మంగళవారం సైతం లైన్‌లో వేచిచూసినా యూరియా రాలేదు. యూరియా దొరక్క వరిపంట రంగుమారి ఎదగకుండా ఉన్న వరి పంటను చూపిస్తున్నాడు. సకాలంలో ఎరువులు వేస్తేనే దిగుబడి వస్తుందని, ఈసారి పెట్టుబడులు సైతం మిగిలేలా లేవని అందోళన చెందుతున్నాడు.



నారాయణపేట జిల్లా మక్తల్ మండలం దాసరపల్లికి చెందిన బాలరాజు 3 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. పదిరోజులుగా మక్తల్ సింగిల్ విండో గోదాం వద్ద లైన్‌లో ఉంటున్నా ఒక్క బస్తా కూడా దొరకలేదు. ఇప్పటివరకు పంటకు ఎరువులు వేయకపోవడంతో వరిపంట ఎదగడం లేదని చెబుతున్నాడు. ప్రభుత్వం త్వరగా సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతున్నాడు.



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని పెద్దగోప్లాపూర్‌కి చెందిన రైతు పేరు చింతకాయల వెంకటయ్య. తనకున్న పది ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, యూరియా కోసం పది రోజులుగా నిత్యం దేవరకద్రకు వస్తున్నాడు. తనతో పాటు భార్య, వదిన, ఇతర కుటుంబసభ్యులను లైన్‌లో ఉంచినా ఐదు బస్తాల యూరియా మాత్రమే దొరికింది. ఇంకా కనీసం ఐదు బస్తాలు కావాలి. ఇప్పటికే ఎరువులు లేక పంట ఎర్రబారిందని, ఇప్పుడు పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నాడు.



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం సింధనూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ మొత్తం ఆరు ఎకరాలు సాగు చేస్తున్నాడు. ఇందులో రెండు ఎకరాలు పత్తి, రెండు ఎకరాలు మిర్చి, మరో రెండు ఎకరాల్లో వరిపంటను సాగుచేశాడు. తన భార్యతో కలసి పది రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నానని, ఇప్పటివరకు నాలుగు బస్తాలే దొరికిందని చెప్పాడు. తాను సాగుచేసిన ఆరు ఎకరాలకు నాలుగు బస్తాలకు ఏ మూలకు చాలడం లేదని, ఈసారి దిగుబడి రావడం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సమస్య జటిలం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యూరియా కోసం రైతుల బారులు

- అన్ని జిల్లాల్లో అడుగంటిన యూరియా నిల్వలు
- నారాయణపేట జిల్లాలో నిల్వ ఉన్నది 20 మెట్రిక్ టన్నులే
- రోజుల తరబడి రైతులకు తప్పని నిరీక్షణ
- పంట ఎర్రబారిందని అన్నదాతల ఆవేదన

సాక్షి ఫోకస్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. రోజురోజుకీ యూరియా కొరత సమస్య మరింత జటిలంగా మారుతోంది. ఉదయం 6 గంటల నుంచే వ్యవసాయ సహకార కేంద్రాలు, గోదాముల ఎదుట రైతులు క్యూలో ఉంటున్నారు. గంటల తరబడి నిలబడలేక చెప్పులు, పట్టాపాస్ పుస్తకాలను క్యూ లైన్‌లో ఉంచుతున్నారు. ఒక్క బస్తా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల ముందు గంటల తరబడి క్యూలో నిలుచున్నా చివరికి ఒక్క బస్తా కూడా దక్కక నిరాశతో వెనుదిరుగుతుండటంతో పరిస్థితి దయనీయంగా మారింది.



వెల్దండ పీఏసీఎస్ ఎదుట ఉదయం 6 గంటల నుంచే క్యూలైన్‌లో చెప్పులు ఉంచిన రైతులు

అడుగంటుతున్న యూరియా నిల్వలు..

వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా రైతులకు యూరియా కష్టాలకు పరిష్కారం దొరకడం లేదు. ఇప్పటికే పంటలను యూరియా వేయాలని ఆశించిన రైతులకు కొరత నేపథ్యంలో భంగపాటు తప్పలేదు. చివరి దశలోనైనా ఎరువులు అందించి పంటలను కాపాడుకుందామంటే యూరియా కొరత సమస్య తీరడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న యూరియా నిల్వలు మరింత అడుగంటుతున్నాయి. నారాయణపేట జిల్లాలో ఇంకా కనీసం 600 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉండగా, జిల్లాలో ప్రస్తుతం 20 మెట్రిక్ టన్నులే ఉన్నాయి. వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ కనీసం 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే వెయ్యి మెట్రిక్ టన్నుల వరకే ఉన్నాయి. జిల్లాలకు అవసరమైన యూరియా నిత్యం తెప్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా, సరఫరాలో జాప్యం నేపథ్యంలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

యూరియా అందక.. పంటలు ఎదగక..

ఇప్పటికే సాగుచేసిన వరి, పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలకు రైతులు యూరియానే ప్రధాన ఎరువుగా వినియోగిస్తున్నారు. పంటలను సాగుచేసినప్పటి నుంచి యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు ఎరువులు అందక ఎదగడం లేదని, రంగు మారుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగుకోసం చేసిన పెట్టుబడి ఖర్చులు సైతం రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల కొరతతో ఈసారి వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు దిగుబడి రావడం కష్టమేనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో బారులు తీరిన రైతులు

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు, గోదాంల్లో యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. డిమాండ్‌కు అనుగుణంగా యూరియా సరఫరా చేస్తున్నాం. నానో యూరియా వినియోగంపై సైతం రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– యశ్వంత్‌రావు, డీఏఓ, నాగర్‌కర్నూల్

ఉమ్మడి జిల్లాలో వానాకాలానికి సంబంధించి యూరియా వివరాలు.. (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	అవసరమైన యూరియా	ఇప్పటివరకు వచ్చింది	సరఫరా చేసింది	ప్రస్తుతం స్టాక్ ఉన్నది	అవసరం ఉన్నది
మహబూబ్‌నగర్	38,787	23,238	22,518	720	15,924
నాగర్‌కర్నూల్	40,000	24,115	23,546	569	7670
వనపర్తి	19,000	16,609	16,209	402	2,791
జోగులాంబ గద్వాల	19,500	15,996	15,018	978	3,500
నారాయణపేట	17,000	16,262	16,242	20	600

కేంద్రాల ముందు రైతుల బారులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల ముందు ఎక్కడ చూసినా రైతులు యూరియా కోసం బారులు తీరి కనిపిస్తున్నారు. నిత్యం వస్తున్న ఒకటి, రెండు లారీల ఎరువుల లోడ్ గంటల వ్యవధిలోనే ఖాళీ అవుతోంది. రైతులు తమతో పాటు భార్య, పిల్లలు, ఇతర కుటుంబసభ్యులను సైతం లైన్‌లో ఉంచుతున్నారు. వంతులవారీగా క్యూలైన్‌లో నిరీక్షిస్తున్నా చాలాచోట్ల యూరియా దొరకని పరిస్థితి నెలకొంది.

‘పాలమూరు’ను జిల్లా బిడ్డే ఎండబెడుతున్నారు..



మాజీమంత్రి లక్ష్మారెడ్డి భార్య శ్వేత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రిజనార్దన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ హయాంలో 90 శాతం పనులు పూర్తి
- మిగిలిన 10 శాతం పనులు ఎందుకు పూర్తి చేయడం లేదు
- కేసీఆర్‌కు పేరు వస్తుందనే పడావు పెట్టారు
- సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి 21 నెలల పాలనలో ఎక్కడ మాట్లాడినా.. నేను పాలమూరు బిడ్డను, నల్లమల బిడ్డను అని చెప్పుకుంటారని.. కానీ ఆయనే పాలమూరును ఎండబెడుతున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి భార్య శ్వేతారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలోని ఆవంచ గ్రామానికి వచ్చారు. శ్వేతారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఆ తర్వాత వారు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని లక్ష్మారెడ్డి ఇంట్లో భోజనం చేశారు. హరీశ్‌రావు తిరిగి హైదరాబాద్‌కు పయనమైన అనంతరం కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు వెనుకబాటుతనానికి టీడీపీ, కాంగ్రెస్ కారణమని ఆయన టీడీపీలో ఉన్నప్పుడే చెప్పారన్నారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే తమ బతుకులు మారుతాయని.. ఆరు గ్యారంటీలు 100 రోజుల్లో అమలవుతాయనే ఆశతో ఇక్కడి ప్రజలు 12 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారన్నారు.

21 నెలలుగా పడావు పెట్టారు..

బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరులో వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి 8 లక్షల ఎకరాలకు నీళ్లు పారించినట్లు కేటీఆర్ వెల్లడించారు. పాలమూరును కోనసీమగా మార్చాలనే లక్ష్యంతో కేసీఆర్ నాయకత్వంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను 90 శాతం పూర్తి చేశామని.. కానీ పాలమూరుకు చెందిన సీఎం 21 నెలలు గడిచినా పనులు పూర్తిచేయడం లేదన్నారు. మిగతా పది శాతం పనులు పూర్తి చేసి.. నీళ్లు పారిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయంతో పాలమూరును పడావు పెట్టారని మండిపడ్డారు. పైసా పని చేయకుండా అదే పాలమూరు ప్రాజెక్ట్‌కు వారి మామ జైపాల్‌రెడ్డి పేరు పెట్టుకోవడంపై ప్రజలే ఆలోచన చేయాలన్నారు.

దురాలోచనతో కొడంగల్‌కు శ్రీకారం..

పాలమూరు ఎత్తిపోతల్లో భాగంగా ఉమ్మడి పాలమూరు, కొడంగల్ నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లాకు ప్రయోజనం చేకూరేలా ప్లాన్ చేసి.. ప్రాజెక్ట్‌ను 90 శాతం పూర్తి చేశామని తెలిపారు. అయితే హడావుడిగా కొడంగల్, రంగారెడ్డికి నీరందించే సోర్స్‌ను శ్రీశైలం నుంచి జూరాలకు మార్చి రూ.4 వేల కోట్లతో సీఎం రేవంత్‌రెడ్డి టెండర్లు పూర్తి చేశారన్నారు. మనసులో ఏదో దురాలోచనతో పర్యావరణ అనుమతుల్లేకుండా టెండర్లు పూర్తి చేయడంతో రైతులు ఎన్జీటీని ఆశ్రయించగా.. స్టే ఇచ్చిందన్నారు. కొడంగల్ ఎత్తిపోతల కింద రైతులు కూడా పరిహారం కోసం రోడ్డెక్కుతున్నారన్నారు.

చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు..

బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ వాళ్లు వేధింపులకు గురి చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. దేవరకద్రలో మండల పార్టీ అధ్యక్షుడిపై లేని కేసు పెట్టి జైలుకు పంపించారని.. కాంగ్రెస్‌లో చేరితే కేసు తీసేస్తామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు, క్రషర్ నిర్వాహకులపై జీఎస్టీ, పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని పార్టీ నాయకులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను చైతన్యవంతం చేసేలా ఆలోచన చేసి ముందుకు సాగుతామన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రిజనార్దన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెప్పుకోలేని దురావస్థలో ఉన్నారు..

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని చెబుతున్నారు కదా అంటూ పార్టీ ఫిరాయింపులకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిచ్చారు. ‘కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలోనే కేసీఆర్‌పై మంత్రులు పొంగులేటి, జూపల్లి ఆరోపణలు, విమర్శలు చేస్తుంటే ఆయన ఎందుకు మౌనం వహించారు.. కాంగ్రెస్‌లో చేరిన కొందరు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నామో చెప్పుకోలేని దురావస్థలో ఉన్నారు’ అని విమర్శించారు.

యూరియా పక్కదారి పడితే చర్యలు



శిక్షణ పొందిన డీలర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్/పెద్దకొత్తపల్లి: జిల్లాలో యూరియా పంపిణీ పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులకు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లావ్యాప్తంగా యూరియా లభ్యత, డిమాండ్, సరఫరాపై కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద అధికారులు నిఘా పెంచి, యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని, రైతులకు యూరియా సమయానికి అందేలా చూడాలన్నారు. జిల్లాలో 5.38 లక్షల ఎకరాల్లో పంట సాగైందని, 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటివరకు 19,859 మెట్రిక్ టన్నులు అందాయని, ఇంకా 15,885 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని చెప్పారు. జిల్లాలో నానో యూరియా వినియోగంపై అవగాహన పెంచాలని, ఇప్పటివరకు రైతులకు 12 వేల లీటర్ల నానో యూరియాను అందించినట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం పెద్దకొత్తపల్లి మండలంలోని కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు.

రైతులకు నష్టం కలగకుండా..

పంట సాగులో ఎలాంటి నష్టం జరుగకుండా ఉండేందుకే విత్తన, ఎరువుల డీలర్లకు శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలో వ్యవసాయ సంబంధిత ఇన్‌పుట్ వ్యాపారాలు నిర్వహించే డీలర్లకు శిక్షణ, విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వంటి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించే వ్యాపారులు డీఏఈఎస్ఐ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) అనే డిప్లొమా కోర్సును తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శిక్షణలో డీలర్లు రైతులకు సరైన మార్గదర్శకత్వం అందించగలిగే స్థాయిలో అవగాహన, సాంకేతిక పరిజ్ఞానం పొందుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 4, 5వ బ్యాచ్‌లకు చెందిన 75 మంది డీలర్లకు డిప్లొమా సర్టిఫికెట్లు అందజేశారు. ఇప్పటి వరకు 200 మంది డీలర్లు ఈ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, డివిజన్ వ్యవసాయ అధికారులు చంద్రశేఖర్, పూర్ణచంద్రారెడ్డి, కార్యాలయ వ్యవసాయ అధికారి శివ, కేవీకే పాలెం కోఆర్డినేటర్ శ్రీదేవి, కేడీఆర్ పాలెం ప్రసాద్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి జ్ఞానశేఖర్, పెద్దకొత్తపల్లి ఏఓ శిరీష, ఏఈఓలు వినోద్, జానకీరాం, సింగిల్‌విండో కార్యదర్శి వెంకటస్వామిగౌడు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాల తనిఖీ

కొల్లాపూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం, వంటగదిని పరిశీలించారు. వంట సామగ్రి, స్టాక్ నిల్వకు సంబంధించిన రికార్డులను చూశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

అచ్చంపేట: నియోజకవర్గానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ (ఏటీసీ)లకు కేటాయిస్తూ అవసరమైన నిధులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సెంటర్, లైబ్రరీ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. పదర మండలంలోని రాయలగండి శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరగా.. దివంగత నేత గడ్డం వెంకటస్వామి పేరుతో ఆలయం ఆవరణలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చూడతామని హామీ ఇచ్చారు.

ఆర్‌అండ్‌బీ ఈఎన్సీని కలిసిన ఎమ్మెల్యే

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా (ఈఎన్సీ) పదోన్నతిపై వచ్చిన మోహన్‌నాయక్‌ను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆయనను కలిసి అచ్చంపేట నియోజవకర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాలునాయక్, వీర్లపల్లి శంకర్, మందుల సామేల్ ఉన్నారు.



మంత్రి వివేక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అభివృద్ధి పనులను పరిశీలించిన పీయూ వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో జరుగుతున్న అభివృద్ధి పనులను వీసీ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. రీసెర్చ్ ఫెసిలిటీ, అకాడమిక్ భవనంలో నూతనంగా నిర్మిస్తున్న లా, ఇంజినీరింగ్ కళాశాలల భవనాలను ఆయన పరిశీలించారు. భవనాలను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు.

క్లుప్తంగా

బైక్ పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

మహమ్మదాబాద్: ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హన్వాడ మండలం నాయినోనిపల్లికి చెందిన వార్ల కృష్ణయ్య (53) అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్యతో కలిసి సోమవారం బైక్‌పై మండలంలోని మొకర్లాబాద్‌కు వెళ్లారు. పని ముగించుకొని రాత్రి 10 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా భారత్ రైస్‌మిల్ ఎదుట బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కృష్ణయ్య తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో స్థానికులు ఓ ప్రైవేట్ వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. కుమారుడు వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి వివరించారు.

బస్సు ఢీకొని కూలీ మృతి

మానవపాడు: ఆర్టీసీ బస్సు ఢీకొని కూలీ మృతి చెందిన ఘటన మంగళవారం 44వ నంబర్ జాతీయ రహదారి బోరవెల్లి స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ కథనం మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా అనంతపూర్‌కు చెందిన పెరుమాల గోవింద్ (51) నిత్యం జాతీయ రహదారిపై రోజువారి కూలీగా పని చేస్తున్నారు. రోజులాగే మంగళవారం కూడా బోరవెల్లి స్టేజీ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై పని చేస్తుండగా హైదరాబాద్ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న నంద్యాల డిపో బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు పెరుమాల జగదీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


నరేశ్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూర్: ఓ వ్యక్తి కనిపించకుండా పోయి.. చెరువులో శవమై తేలిన ఘటన మంగళవారం ఆత్మకూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పోతు నరేశ్‌కుమార్ అలియాస్ నాని (42) పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. ఈ నెల 7న సాయంత్రం కుటుంబ సభ్యులకు సమాచారం అందించకుండా ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. మంగళవారం ఉదయం స్థానిక పరమేశ్వరస్వామి చెరువులో శవం తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీయగా.. అది నాని మృతదేహంగా కుటుంబసభ్యులు గుర్తించారన్నారు. బావ మ్యాడం శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, నాని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ అన్నారు.

విద్యార్థి అదృశ్యం


శ్రీకాంత్

చౌటుప్పల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల నుంచి విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాలను కొంత కాలంగా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ పరిధిలోని నేతాజీ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో గద్వాల్ జిల్లా లతిపురం గ్రామానికి చెందిన గొల్లతిప్పడంపల్లి శ్రీకాంత్ 7వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం 9గంటలకు పాఠశాల ప్రారంభమయ్యే సమయానికి శ్రీకాంత్ కనిపించలేదు. హాస్టల్ చుట్టు పక్కల ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించక పోవడంతో హిందీ టీచర్ ఖారత్మల్ దయవంతి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ ఉపేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

దాడి కేసులో ఏడుగురికి రిమాండ్

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలో మాజీ కౌన్సిలర్, వారి కుటుంబ సభ్యులపై అకారణంగా దాడి చేసి కులం పేరుతో దూషించిన ఏడుగురిని అదుపులోకి తీసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల డీఎస్పీ మొగులయ్య తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కాలనీకి చెందిన తాజా మాజీ కౌన్సిలర్ మహేష్, తండ్రి శ్రీనివాసులు, వినయ్‌పై చింతలపేటకాలనీకి చెందిన కొందరు యువకులు మద్యం మత్తులో అకారణంగా కర్రలు, రాళ్లతో దాడి చేసి కులం పేరుతో దూషించారన్నారు. అంతటితో ఆగకుండా వినాయకుడి లడ్డును సైతం అపహరించి మురుగు కాల్వ సమీపంలో విసేరేసి వెళ్లారని.. బాధితుడు వినయ్ ఫిర్యాదు మేరకు వారిపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు దాడికి పాల్పడిన ఘటనలపై అదేరోజు పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని గద్వాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని.. వారిని సైతం త్వరలో అదుపులోకి తీసుకుంటామని చెప్పారు.

తనువు చాలిస్తున్నారు..!



క్షణికావేశంలో తీసుకునే నిర్ణయానికి ఒక నిండు ప్రాణం బలవడంతో పాటు వారిని నమ్ముకున్న వారు రోడ్డున పడుతున్నారు. చదువులో ఒత్తిడితో విద్యార్థులు, కుటుంబ సమస్యలతో వివాహితులు ఆత్మహత్య చేసుకునే ఘటనలు వరుసగా చోటు చేసుకుంటుండడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇవి ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయనే గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆత్మహత్య చేసుకునే వారిలో ఎక్కువగా పురుషులే ఉంటున్నారు. బుధవారం అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం.

మహబూబ్‌నగర్ క్రైం:

- ఒత్తిడితో విద్యార్థులు, నిరుద్యోగులు.. సమస్యలతో వివాహితులు బలవన్మరణాలు
- మూడేళ్ల కాలంలో 653 మంది ఆత్మహత్య
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

■ ఒత్తిడి.. ఆత్మన్యూనతా భావం.. కారణాలు ఏవైనా భావి భారతానికి దిక్సూచిలా మారాల్సిన యువతరం బలవన్మరణాలకు పాల్పడుతోంది. పదో తరగతి మొదలు మార్కులు, ర్యాంకుల మాటున పిల్లలపై విపరీతమైన ఒత్తిడి ఏర్పడుతోంది. ఈ కారణంగా కొందరు విద్యార్థులు అనుకున్నది సాధించలేనన్న నిరాశ, నిస్పృహల్లో ప్రాణాలు తీసుకుంటున్నారు.

■ జిల్లాలో అత్యధికంగా జడ్చర్ల, మహబూబ్‌నగర్ రూరల్, నవాబ్‌పేట, రాజాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆత్మహత్యలు అధికంగా జరుగుతున్నాయి. నవాబ్‌పేట పరిధిలో మూడేళ్ల కాలంలో 53 మంది ఆత్మహత్యకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. 42 గ్రామ పంచాయతీలు ఉండగా ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు.

పాలమూరు జిల్లాలో మూడేళ్లలో నమోదైన ఆత్మహత్యలు

ఏడాది	మహిళలు	పురుషులు	మొత్తం
2023	59	131	190
2024	59	140	199
2025	46	88	134

రైల్వే పోలీస్‌స్టేషన్ల పరిధిలో.. ఆత్మహత్యలు



2024	2025
85	45

ఒత్తిడిలో ఉంటే..

- ప్రతికూల ఆలోచనలు ఎక్కువగా వస్తాయి.
- ఉదయం లేచినప్పటి నుంచి ఉత్సాహం ఉండదు.
- ఏ రోజుకారోజు చేసే పనులపై దృష్టి పెట్టలేరు.
- ఒంటరితనం అలవాటవుతుంది.
- నిద్రాహారాలు పూర్తిగా తగ్గిస్తారు.

■ ఒత్తిడికి సంబంధించి స్ట్రెస్ అట్రిబ్యూషన్ థియరీ అనేది ఉందని నిపుణులు చెబుతున్నారు. దీన్ని 3 రకాలుగా బేరీజు వేస్తుంటారు. దాని ఆధారంగా కారణాలు గుర్తించి సాధారణ జీవితం గడిపేలా చేయొచ్చు. తొలుత ఒత్తిడికి కారణం ఏంటన్న విషయాన్ని గుర్తించాలి. తనకు తానుగా ఒత్తిడికి గురవుతున్నాడా.. లేదా బయటి పరిస్థితుల కారణమవుతున్నాయా అన్నది తెలుసుకోవాలి. రెండోది ఒత్తిడి ప్రభావం ఎంత మేరకు అనేదానిపై స్పష్టతనివ్వాలి. ఏదైనా ఒక అంశంలో నిరాశకులోనైతే అది అక్కడికే పరిమితమన్న విషయం గుర్తుంచుకోవాలి. జీవితంలోని అన్ని అంశాలకు దాన్ని అన్వయించుకోవడం మంచిది కాదు. మూడోది ఒత్తిడి స్థిరమైనదా లేదా అస్థిరమైనదా? అన్నది ముఖ్యం. అపజయం ఎదురైతే అది కేవలం అక్కడికే పరిమితం అన్నది తెలుసుకోవాలి. అదే శాశ్వతమనుకుని నిరాశ చెందొద్దు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనే విషయంపై అవగాహన పెంచుకోవాలి. కళాశాలల్లో విద్యార్థులపై అకడమిక్స్ పరంగా ఒత్తిడే కాకుండా సృజనాత్మకతకు పెద్దపీట వేయాలి.

మనకు మనమే పోటీ



విద్యార్థులు, రైతులు, యువకులు ఎవరికైనా మానసిక ఒత్తిడి పెరిగిన సందర్భంలో న్యూరో ట్రాన్స్‌మీటర్స్ దెబ్బతిని ఆ సమయంలో ఆత్మహత్య ఆలోచనలు వస్తాయి. అనుకున్న స్థాయికి రీచ్ కాలేకపోయిన క్రమంలో బాధ, దుఃఖంలో ఆసక్తి లోపిస్తాయి. చుట్టూ ఉండే వాతావరణం, ఇతరులతో పోలిక వంటి వాటి కారణంగా విద్యార్థులు ఒత్తిడిలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు వారిని అసవరమైన మేర ప్రోత్సహించాలి. చదువు విషయంలో ప్రణాళిక, సమయపాలన ఎంతో ముఖ్యం. కష్టమైన సబ్జెక్టు ఉంటే ప్రతి రోజూ సాధన చేయాలి. మెదడుకు చదువుపై ప్రణాళికబద్ధమైన అలవాటు చేయాలి. చదువుకునే సమయంలో సెల్‌ఫోన్, టీవీలు వంటి వాటి జోలికి వెళ్లకుండా పూర్తి ధ్యాసంతా పుస్తకాలపైనే ఉంచాలి.

– డాక్టర్ భార్గవ స్వరాజ్, మానసిక వైద్య నిపుణుడు

అపోహలకు గురి కావద్దు



భార్యాభర్తలు ఒకరిపై ఒకరు నమ్మకంతో ఉండాలి. ఏదైనా సమస్య తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలి. సమస్యను జటిలం చేసుకోవద్దు. పరస్పర అవగాహనతో మసులుకోవాలి. ఒకరికి తెలియకుండా మరొకరు గోప్యత పాటిస్తే సహజంగానే ఇంకొకరికి అనుమానం కలుగుతుంది. వివాహ బంధం భార్యాభర్తలిద్దరై సమానమే. ఏ ఒక్కరూ తాము పైచేయి సాధించాలని చూసినా ఆ కుటుంబంలో తరుచూ గొడవలు జరుగుతుంటాయి. దాన్ని ఆదిలోనే తుంచేయాలి. పిల్లల ఎదుట దంపతులు గొడవపడడం ద్వారా వారిలో అభద్రతా భావం పెరుగుతుంది. కుటుంబంపై ప్రేమ మమకారం కోల్పోతే చెడు ఆలోచనలు వస్తాయి. కుటుంబ సభ్యులు అన్నీ విషయాలను అందరితో చర్చించాలి.

– వంగీపురం శ్రీనాథాచారి, ప్రముఖ మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడు

గురుకుల విద్యార్థుల ఆందోళన


చిట్యాల గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి


కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తున్న విద్యార్థులు

- కలెక్టర్‌ను కలిసేందుకు ప్రహరీ దూకిన వైనం
- పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో సమావేశమైన కలెక్టర్

వనపర్తి రూరల్: పాఠశాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు విన్నవించేందుకు మంగళవారం మండలంలోని చిట్యాల ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాల పదోతరగతి విద్యార్థులు ప్రహరీ దూకి వనపర్తి వైపు పంట చేనుల్లో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పట్టణంలో తిరిగి వెదికి పట్టుకున్నారు. పాఠశాలకు రావాలని కోరగా కలెక్టర్‌ను కలిసేదాకా వచ్చేది లేదని పట్టుబట్టడంతో సర్దిచెపి ఆటోలో పాఠశాలకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, ఆర్‌సీఓ శ్రీనివాసులు, సీఐ కృష్ణయ్య, తహసీల్దార్ రమేష్‌రెడ్డి పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి పాఠశాలను సందర్శించి నేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలలో మెనూ సరిగా పాటించడం లేదని, ఆటలు ఆడించకుండా రాత్రి 10 వరకు చదివిస్తున్నారని, తల్లిదండ్రులను కలవనీవడం లేదని ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేయిస్తానని.. ఏవైనా సమస్యలుంటే అందులో వేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. విద్యార్థులకు స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యనందించాలని, సృజనాత్మకత, నైతిక విలువలు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాణ్యమైన బోధనతో పాటు ప్రేమాభిమానం చూపించాలన్నారు. క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తయారు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భుజించారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఏకం కావాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి స్కైలాబ్‌బాబు


మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి స్కైలాబ్‌బాబు

అలంపూర్: రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలందరూ ఏకం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి అధ్యక్షతన 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం ఆవిర్భవించి 75 ఏళ్లు గడిచినా.. రాజ్యంగ ఫలాలు సామాన్యులకు దక్కడం లేదన్నారు. దేశంలోని 200 మంది కోటీశ్వరుల ఆస్తులు 40 శాతం ప్రజల ఆస్తితో సమానంగా ఉన్నాయని.. జనాభాలో ఒక శాతం ఉన్న వారి చేతిలో 50 శాతం ఆస్తులు ఉన్నాయని వివరించారు. ఓ వైపు సంపన్నుల ఆస్తులు పెరుగుతుండగా.. 42 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని చెప్పారు. దేశంలో 80 కోట్ల మంది రేషన్ బియ్యం కోసం ఎదురు చూస్తున్నారంటే పేదరికం ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. బీజేపీ 11 ఏళ్ల పాలనలో సామాజిక, ఆర్థిక అంతరాలు మరింత పెరిగాయని.. కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్ల రాయితీలిస్తూ సామాన్యులపై పెను భారం మోపుతోందని విమర్శించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి మనుషుల మధ్య విభజన తెస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ హయాంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు 300 రేట్లు పెరిగాయని, నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో వివరాల ప్రకారం ఐదేళ్లలో 6,34,066 ఫిర్యాదులు నమోదైనట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 3.40 లక్షల దౌర్జన్యాలు జరిగాయని.. బిహార్‌లో 65 లక్షల మందిని ఓటుకు అనర్హులుగా చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యంతో ఆధార్‌తో ఓటు హక్కు నమోదు చేస్తున్నారని తెలిపారు. మహిళల భద్రతలో దేశం 135 స్థానంలో ఉందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి పని దినాలు కల్పించడం లేదని.. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్‌లో రిజర్వేషన్ల సాధనకు జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాసంస్థల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశన్న, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, ప్రధానకార్యదర్శి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు గట్టు మారెన్న, వెంకటస్వామి, విజయ్‌కుమార్, సవరన్న, రాజు, సుధాకర్, సంజీవ, నాగరాజు, మద్దిలేటి, సామేలు, నర్సింహ, మౌలాలి, జయన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు తగ్గిన ఇన్‌ఫ్లో


జూరాల దిగువ విద్యుదుత్పత్తి కేంద్రం వద్ద వియ్యర్

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో వరద మరింత తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు 65 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 45వేల క్యూసెక్కులకు తగ్గింది. విద్యుదుత్పత్తి నిమిత్తం 20,139 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 90 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,190 క్యూసెక్కులు, కుడి కాల్వకు 640 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 22,059 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా.. జూరాల ఎగువ, దిగువలో 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. రెండింటిలో కలిసి ఇప్పటి వరకు 632.233 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

■ శ్రీశైలం జలాశయంలో మంగళవారం 883.6 అడుగుల నీటిమట్టం వద్ద 207.8472 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 20,139, సుంకేసుల నుంచి 30,884 మొత్తం 51,023 క్యూసెక్కులఇ ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,215, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,884 మొత్తం 66,199 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 32,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,824, ఎంజికెఎల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సుంకేసులకు 43 వేల క్యూసెక్కులు

రాజోళి: సుంకేసుల డ్యాంకు మంగళవారం ఎగువ నుంచి 43,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 9 గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 39,708 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

9 ఏళ్ల వయసులో హాఫిజే ఖురాన్

అభినందించిన జామియా నిజామియా చాన్సలర్


హాఫిజా ఉమ్మల్ ఖైర్‌ను సన్మానిస్తున్న ఛాన్సలర్ ముఫ్తి ఖలీల్ అహ్మద్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం షాసాబ్‌గుట్టలోగల మదర్సా దారుల్ ఉలుమ్ అరబియా లిల్ బనాత్ ఫౌండర్, డైరెక్టర్ హాఫిజ్ ఖాజా ఫైజొద్దీన్ కుమార్తె ఉమ్మల్‌ఖైర్ మాహిరా 9 ఏళ్లకు హిఫ్జే ఖురాన్‌ను పూర్తి చేశారు. మూడున్నరేళ్లలో ఆమె పట్టుదలతో కష్టపడి హాఫిజా ఖురాన్ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం బాలికను హైదరాబాద్‌లోని జామియా నిజామియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ముఫ్తి ఖలీల్ అహ్మద్ ఘనంగా సన్మానం చేశారు. పవిత్ర రబీలవల్ మిలాద్ ఉన్ నబీ మాసంలో హిఫ్జే ఖురాన్ కావడం సంతోషంగా ఉందన్నారు. ఈమెను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది బాలికలు పట్టుదలతో చదివి హిఫ్జే ఖురాన్ కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాజా మొయినుద్దీన్, సాజిదా బేగం, మదర్సా ప్రిన్సిపాల్ హాఫిజా హుస్నా ఫాతిమా, ఖాజా రియాజుద్దీన్, ఖాజా మొయిజుద్దీన్, ఖాజా సైఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చీటి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెంట్లవెల్లి: కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయిని చీటి డబ్బులు ఇవ్వడం లేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నంబావి మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన పట్టిమీది లక్ష్మయ్య పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కళ్యాణితో చీటి వేశాడు. ఈ క్రమంలో కళ్యాణి లక్ష్మయ్యకు రూ.6.80లక్షలు ఇవ్వాల్సి ఉంది. కానీ బాధితుడు డబ్బులు ఇవ్వాలని ఎప్పుడు అడిగినా కాలయాపన చేస్తుందే తప్పా.. కళ్యాణి డబ్బులు చెల్లించలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మయ్య కుటుంబ సభ్యులతో మంగళవారం కళ్యాణి పనిచేస్తున్న కస్తూర్బా పాఠశాలకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. గమనించిన సిబ్బంది పురుగుల మందు డబ్బాను లాక్కొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో ఎస్‌ఐ రామన్‌గౌడ్ బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు. న్యాయం చేస్తామని ఎస్‌ఐ హామీ ఇవ్వడంతో లక్ష్మయ్య కుటుంబ సభ్యులు వెనుదిరిగారు.

ఆదివాసీలకు ఉన్నత విద్య ఉచితం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

మన్ననూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఆదివాసి గిరిజనులకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయం విశ్వవిద్యాలయం డీన్, స్టూడెంట్ ఎఫైర్, ప్రొఫెసర్ దయాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఐటీడీఏ ఏఓ జాఫర్‌ఉసేన్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో ఆదిమ జాతి చెంచులు, కోయ, కొల్లం, కొండ రెడ్లు, గోండులు విద్యాపరంగా ఉన్నత చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. దీంతో వారు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని వైస్ చాన్సలర్ గంట చక్రపాణి ఆదేశాల మేరకు సమతా సపోర్టు స్కీం ద్వారా ఆదివాసీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం రూ.500 మాత్రమే చెల్లించి ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆదివాసి గిరిజనులతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులు, వారి పిల్లలకు కూడా ఉచితంగా విద్యా అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్టోబర్ 13 వరకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్, 73829 29570/580/590/600 ఫోన్ నబర్లను సంప్రదించాలని కోరారు. అంతకు ముందు యూనివర్సిటీ బృందం సభ్యులు అమ్రాబాద్ మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ బృందం సభ్యుడు డాక్టర్ కంభంపాటి యాదగిరి, విజయ్, కళ్యాణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఫైనాన్స్ కంపెనీలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో ఫైనాన్స్ కంపెనీలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికొండ చౌరస్తాలో నిర్వహిస్తున్న ఆటో ఫైనాన్స్ షెటర్ తాళాలను పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు రూ. 2.50 లక్షల చోరీ చేశారన్నారు. ఆటో ఫైనాన్స్ సిబ్బంది మంగళవారం ఆఫీసు తెరిచేందుకు రాగా షెటర్ తాళం విరగ్గొట్టి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

రూ.2.79 లక్షలు..

కల్వకుర్తి టౌన్: నగదుతో బైకుపై వెళ్తున్న వ్యక్తికి మాయమాటలు చెప్పి నగదు చోరీ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవ రెడ్డి, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వంగూర్ మండలంలోని ఉల్పరకు చెందిన రాము పట్టణంలోని ఎస్‌బీఐలో బంగారాన్ని తనఖా పెట్టి రూ.2.79లక్షల రుణం తీసుకున్నాడు. ఆయన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యలో ఇందిరానగర్ కాలనీలో జైలు శాఖ పెట్రోల్‌బంక్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి మీ డబ్బులు కిందపడి పోయాయి చూసుకోండన్నారు. దీంతో బాధితుడు బైక్ ఆపి చూసుకుంటుండగా నిందితులు ఆ డబ్బును లాక్కొని పరారయ్యారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సైబర్ మోసం.. రూ.22 లక్షలు మాయం

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకటేశ్వర్‌రెడ్డి సైబర్ వలకు చిక్కి రూ.22 లక్షలు పోగొట్టుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి రెండేళ్లుగా షేర మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తుండేవాడు. ఈ ఏడాది జూన్ 25 తేదీ నుంచి 9 విడతల్లో రూ.22,30,040 నగదును గ్రో అనే షేర్ మార్కెట్‌లో ఇన్‌వెస్ట్ చేశారు. సోమవారం డబ్బులు డ్రా చేసేందుకు యత్నించగా రూ.13 లక్షలు ట్యాక్స్ చెల్లించాలని వాట్సాప్‌లో సందేశం రావడం.. పెట్టిన డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి మంగళవారం సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.